కథానిక

# అపోహలు

"గోపీ"

చిన్న వస్తువులు, చలోక్తిగా అన్న మాటలు వీటికి సహజంగా మానవ హృదయాల్లో భూకంపాలు తెచ్చే శక్తి లేకపోయినా, ఒక్కొక్కప్పుడు, ఏవేవో పాతవిషయాలని జ్ఞాపకంచేసి మనస్సును కలచివేస్తాయి. చిన్న గాలివాన మొదలు భూకంపాలవరకూ గూడా లేవదీస్తాయి, ఒక్కొక్కప్పుడు!

మీన విషయంలో ఆవేళ అంతే అయింది. హాస్పిటల్ యూనిఫారం వేసుకుని, కొండమీదున్న "హాస్టల్"నించి త్వరత్వరగా దిగొస్తూంటే పసుపుబొట్లతో ఉన్న కవరు అందించాడు పోస్టుమన్. పైవిలాసం చూడగానే రాజు వ్రాసినట్లు పోల్చుకుంది. గుండెలు దడదడ కొట్టుకున్నాయి. వణుకుతూన్న చేతులతోనే కవరు చించి గబగబా లోపలివిషయం చదివి, నిట్టూర్చింది.

"గతం మరిచిపో. గతించిన విషయాలని మధించి హాలాహలం తప్ప అమృతం తియ్యలేవు" అని ఎంతమందన్నారో! కాని చాలామంది జీవించేది గతంతోనే! కాకపోతే. ముందేవో ఉందని కలలుకంటూనో! కాని ప్రస్తుతం ఎప్పుడూ అప్రస్తుతమే! ఆలోచనే చెయ్యరు! అన్న ఒక ఫిలాసఫీని అలవరచుకుని, జరిగిపోయినవన్నీ మరిచిపోవాలని ప్రయత్నంచేసి, విజయం పొందేననుకుంది పిచ్చి మీన. అనువు చూచుకుని భూమిని బద్దలుకొట్టి, తెరతెరలుగా పైకి ఉబుక్కొచ్చే, అగ్నిపర్వతపు లావాలాగ మరుపుకొచ్చాయనుకున్న విషయాలు విప్లవాన్ని లేవదీశాయి మనస్సులో. జ్ఞాపకానికొస్తున్న విషయాల మీద నిర్దాక్షిణ్యంగా శవపరీక్ష కూడా ప్రారంభించింది.

"మీ నాన్నగారి మతి చెడిందమ్మాయ్. ఎవ్వరితోనూ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయారు. అనాథనైన నామీద సంఘంకూడా దాడితీసింది. నిందలు మోపింది. "ఆమెవల్ల తప్పులేకుండా ఎందుకు పారిపోతాడు!" అని సాగదీసింది. ఇంట్లో అద్దెకున్న ధర్మంగారు మాత్రం ఆదరించారు. ఆయన మొదటినుంచీ చెడ్డపేరే సంపాదించారనుకో... మా పేర్లు కలిపి గోడకెక్కించారు. సరే నీకోసం, మణికోసం, అతని రక్షణ పుచ్చుకోక తప్పలేదు. అబద్ధం నిజమైంది" అని తల్లి సంఘం చేసినవాడిమూలంగా ధర్మంచేతిలోనికి జారిపోయినట్లు తేల్చింది. "నీతి తప్పినదాంతో కాపురమేంటని, పరాయిదైపోయాడని; ఇంట్లో ఇంట్లో వ్యవహారం కాబట్టి ఇన్నాళ్లూ దాగిందని" లోకం కూసింది. దేన్ని నమ్మడం? అని ఆలోచన ప్రారంభించింది. నల్లగా తాటిచెట్టులా ఉన్న ధర్మయ్యని అమ్మ ప్రేమించిందంటే నమ్మకంతోచలే. కాని రాజులో ఏం చూచింది తను?

వాచీ చూచుకునేసరికి అప్పుడే 12 నిముషాలు ఆపరేషన్ థియేటర్‌కి ఆలశ్యం అని గ్రహించి ఒక్కదాటులో చేరుకుంది. ఆమె దురదృష్టమో అన్నట్లు మేట్రన్, డాక్టర్, కొసకి ఫైనలియర్ స్టూడెంటు, అంతా ఆమెపనిలో తప్పులు పట్టారు. అసలే కోతపడ్డమనస్సు. కారం జల్లినట్లయింది.

నాలుగున్నరకి 'డ్యూటీ' వదలి హాస్టలు చేరుకుంటూంటే, ఎన్నో సంవత్సరాలైనట్లనిపించింది. ఎత్తు ఎక్కుతూంటే ఎన్నడూలేని ఆయాసం కూడా వచ్చింది. ఆఫీసు బురఖా విప్పి స్నానాల గదిలోకి గంతువేసింది, స్నానంచేసి బిచికిపోతే ఈబాధ తప్పుతుందనే నమ్మకంలో... "గతిలేక ధర్మం చేతిలోపడ్డాను" అని అంటూంది అమ్మ. కాని పిల్లల భావి ఆలోచించిందా? మళ్ళీ, మళ్ళీ అదే ఆలోచన సాగింది మనస్సులో. స్నానంచేస్తూంటే, స్నేహితులు చలోక్తిగా అన్నమాట జ్ఞాపకంవచ్చింది. "మీన నలుపైతే నేం! ఆమెకళ్లూ అంగసౌష్టవం చాలు అబ్బాయి

ఏడిపించడానికి" ... పాపం! ఆమె కెప్పుడూ అబ్బాయిల నేడిపించాలని ఉండేది కాదు! స్నానంచేసి దుస్తులు వేసుకుంటూంటే, తనమీద ఎన్నడూలేని అసహ్యంవేసింది. బీచి ప్రయాణానికి తయారౌతూ పరాగ్గా ప్రొద్దుటి శుభలేఖ తిరగవేసింది. చిన్నఅక్షరాలతో గుండ్రంగా వ్రాసిన రెండుపంక్తులు చదివింది. "అకారణంగా నీలో ఆశలు కల్పించి భగ్నపరచినట్లయితే క్షమిస్తావని నమ్ముతూన్న-రాజు"

లోపల మంటకి పైపైన శీతలోపశమనం చేయడానికి ప్రయత్నం దండుగని తెలుసుంది. మరో అడుగుకూడా పడలేదు ముందుకు. అలాగే కూలపడింది కుర్చీలో, కళ్లెంవదిలిన గుర్రంలా, పరిగెత్తడం మొదలుపెట్టాయి ఆలోచనలు. దాంతో వెనకాడలే దుమ్ముకూడా రేగింది.

"బిడ్డలు తల్లిదండ్రులని ప్రేమించడంతో మొదలుపెడతారు. పెద్దవాళ్లయినాక విచారణ చేస్తారు. ఎక్కడో కాని క్షమించరు" ఎక్కడో చదివింది మీన. "ఎంత నిజం" అనుకుందప్పుడు గదికూడా ఆమెమనస్సులోలాగే చీకటి పడింది. దూరాన్నఉన్న దీపాలు, ఎత్తుగాఉన్న ఆమె గదిలోంచి నక్షత్రాల్లా కనబడుతూన్నాయి. కిటికీలోంచీ 'డాల్ఫిన్సునోస్', సముద్ర హృదయంలోకి చొచ్చిన బాహులాగుంది. (అందుకే ఆ ఘోషకూడా నేమో! అనిపించింది) తీక్షణ దృష్టితో ఆలోచనల్ని సారిస్తూండడంలో, అంతర్జనితమైన ఒక దుష్టశక్తికి లొంగిపోయింది. ఈ దుష్టశక్తి, ఆలోచనలకి రూపాలనిచ్చి ప్రత్యక్షంగా చూపిస్తూంది దూర్భిణిలా. బీచివద్దున కూర్చొని కులుకుతూన్నాడు రాజు తన నూత్న వధువుతో, సముద్రంమీంచీ వచ్చే చల్లగాలి ఆమె ముంగురులని, పయటని చెదరగొడుతూంది. కళ్లు మూసుకుంది. 'కొన్ని వందలమైళ్ళదూరంలో ఉన్నాడు రాజు' అనుకుంది. మళ్ళీ వాస్తవిక ప్రపంచంలో పడడానికిగా మళ్ళీ కళ్ళువిప్పి చూచింది. ఎంతోమంది తమ భార్యలతోను, బిడ్డలతోనూ కులుకుతూ నడిచిపోతూన్నారు. ఆ బీచిమీదే సీత, శాంత, అనసూయ, అంతా తమ భర్తలతో ఉండివుంటారు. శాంతచేతులో బిడ్డ కూడా ఉంది. ఆలోచనకి, కలకి, వాస్తవికతకి, ఏమీ తేడాఉన్నట్లు తోచటంలేదు. ఆదేసమయంలో, శాంత నాలుగువందలమైళ్ళ దూరంలో ఉంది. కాని ముందురోజునే శాంతకి బిడ్డపుట్టినట్టుకు జాబుకూడా వచ్చింది! కాలం స్థలం కట్టుతప్పి పోతున్నాయి... చదువుకునేటప్పటి రోజులు జ్ఞాపకంతెచ్చుకుని అనంతమైన ఆలోచనా సముద్రంలో లంగరు వేసుకు నిలబడదామని నిశ్చయించింది... "నేను బడిలో చదివేదాన్ని" అని మనస్సులో మొదలుపెట్టింది. వెంటనే హిస్టరీ క్లాసు కనిపించింది, అంతారాలేదా క్లాసుకి, సీత, శాంత, అనసూయ ఉన్నారు. ఇంకా మరోనలుగురుకూడా ఉన్నారు. ప్రశ్నోత్తరాల తరువాత, "ఎవరెవరేం చేస్తారని" అడిగారు అయ్యవారు. డాక్టరు చదువుతానంది శాంత. సీత సంగీతం నేర్చుకుంటానంది. అనసూయ వేళాకోళంగా అయ్యవారు చేస్తానంది. తనుమాత్రం జవాబు చెప్పలే. "చెప్పవే" అని పొడిచారు. కాని చెప్పలేదు. శాంత చెప్పింది. "మీన పెళ్ళి చేసుకుంటుంది. 'స్త్రీకి గృహమే ఆదర్శం' అని మొన్నటి బేటింగులో ఘాటుగా వాదించింది" అప్పుడు మీనకది తప్పుగా కాని, కోరతగనిదిగా కాని కనపడలే... "ఉద్యోగాలు చేస్తామన్న వాళ్ళంతా పెళ్లిళ్లు చేసుకున్నారు. ఇంట్లోవుందామనుకున్నవాళ్లు ఉద్యోగాలు చేస్తున్నారు. ఇదేగాబోలు 'ఐరనీ ఆఫ్ ఫేట్' అంటే అని మళ్ళా ఆలోచన తట్టింది అందులోనే!...

పరీక్షలు కావటం, తల్లి 'ధర్మయ్య' తో ఘోరంగా దెబ్బలాడి రావటం, ఒంటిగది కాపురం, అవస్థలు పడటం చిన్న 'రీల్'లా తిరిగాయి. తీరుబాటుగా ఉండటాన్ని వరండామీద ఏదో అల్లుతూ పరిశీలనగా చూచింది. సన్నగా, పొడుగ్గా, నల్లగా ఉన్న కాలేజీకుర్రాడు కనిపించాడు. చూస్తూన్నే అసహ్యించుకుంది. (ఎప్పుడూ చదువులో పడిఉన్న రాజుకి ఆ వూసే లేదు) ..కాని వంటచేసుకు మరీ చదువుకుంటున్నాడనగానే "పేదవాడు హోటల్‌కికూడా డబ్బిచ్చుకోలేడ"ని జాలి చూపింది. తల్లిని బలవంతంచేసి, ఆ పరీక్షలున్న ఒక్కనెలా భోజనం వాళ్లింట్లో చేసేందుగ్గా ఒప్పించింది. పేదవాడు కాడు, వంటచేసుకోడం ఏదో డాక్టరు సలహా

వల్ల; ఖర్మంచాలక ఆ గదిలో ఉన్నాడు అని తెలిశాక ఆశ్చర్యపోయింది. భోజనందగ్గర మాటల్లో అభిప్రాయాలు, ఆదర్శాలు తెలుసుకొని ప్రేమించింది. "నెలల్లా పరీక్షలు; తరువాత ఊరికెళ్ళిపోతాడు" అని రోజూ అనుకునేది... "ఆయన వెళ్ళిపోగానే వికారాలన్నీ చప్పబడతాయి" అని ఊరటిల్లింది తల్లి పరీక్షలై వెళ్ళిపోతూ జ్ఞాపకార్థం ఇచ్చిన కథలపుస్తకం చూచినప్పుడల్లా, ఏడ్చింది కూడాను. "రూపం ఎల్లాఉన్నా, సాధించగల్గి ఉంటే, ఎంత బాగుణ్ణు" అని ఎన్నో సార్లనుకుంది. కథానాయికలు, కథానాయకులు ఎదురొక్కనే పన్ని వేళాలేమీ రానందుకు... వచ్చినా, వాడుకపడకపోయినందుకు, చదివిన పుస్తకాలన్నిటినీ తిట్టుకుంది...

పరీక్ష ప్యాసైంది. వాస్తవికతజీవితం "ఏం చేస్తావని" అడిగింది. చదువుకూన్నప్పటి సమదృష్టి ఆధిక్యత మాయమయ్యాయి. పైచదువుకి పైసాలేదు... ఎన్నింటికో దరఖాస్తులు పెట్టింది. కలిసొచ్చిందొక్కనర్సు ట్రైనింగు మాత్రమే. ఇష్టంలేదు... తప్పతుందా?... స్కూల్లో చదువుతూన్నప్పటి జీవితాన్ని ఊహపోనప్పుడూహించుకున్న రెస్పాన్సలేని ప్రేమని, తలుచుకుని నవ్వుకుంది బీచిమీదపోతూ. నవ్వింకా పెదిమలమీద ఆరలేదు. అదే బీచిమీద రాజు ప్రత్యక్షమయ్యాడు. తత్తరపడింది, "ఎలా వచ్చారని" అడిగింది కంగారుగా.

"యూనివర్శిటీలో చేరాన"న్నాడు రాజు.

గత నాలుగునెల్లలో జరిగిన మార్పులు, విశేషాలు ముచ్చటించారు అదేబీచిలో, అదేస్థానంలో. మూడేళ్ళ క్రిందట, ఇవన్నీ అదేమైకంలో బహుస్ఫుటంగా గోచరించాయి.

భోజనానికి గంట వినపడింది. ఏవో మాట్లాడుకుంటూ గోలగాపోతున్నారు, తక్కిన నర్సులు, రమణి "ఆలశ్యంగా వస్తాను, భోజనం గదిలో పెట్టించమని" చెప్పిన విషయం జ్ఞాపకంవచ్చింది. కాని కదల్డానికి కాలు రాలేదు. "నాకింకా పిచ్చెత్తలేదు" అనిమాత్రం అనుకుంది. మళ్ళా ఆలోచనలోపడింది. "సాంఘికంగా తనకి తలవంపు లేకపోతే, నా చిన్న కోరిక తీరకపోయుండునా? ఇంతకీ తల్లిదండ్రుల పాపాలు పిల్లల్ని పీక్కుతింటాయి." ఈమారు ఇలాంటి ఆలోచనల్ని అరికట్టడానికి ప్రయత్నం చెయ్యడంకూడా మానేసింది. అకస్మాత్తుగా కనిపించిన రాజుని "అప్పుడప్పుడు వస్తూంటారుకదూ?" అని పిలిచింది. "ఓ" అన్నాడు. ప్రతిరెండువారాలకోసారన్నా వచ్చి అవీ ఇవీ మాట్లాడిపోతూండేవాడు. చాలా స్నేహంగా ఉండేవాడు. ఎక్కడ "చనకబారు నర్సుగా తీసుకుంటాడో" అని చాలాజాగ్రత్తగా మసిలేది. చాలాసార్లు...రాజుకి జబ్బుచేసినట్లు, తన వార్డులో పడ్డట్టు, కళ్ళనీళ్ళతో డాక్టర్లని ప్రార్థించినట్లు, తరువాత తన యభీష్టము నెరవేరినట్లు కలలుకన్నది. "ఛీ ఇదంతా స్వార్థం," అని మళ్లా తిట్టుకునేది. మొదటిరోజు బీచిలో కలుసుకున్నప్పడెలా వున్నాడో రెండు సంవత్సరాలు గడిచినాకూడా అదేతత్వం చూపిస్తూన్నాడని గ్రహించగానే, గుండె బరువెక్కింది. ఊహల్లో నిర్మించుకున్న ఇల్లు, సంసారం, ఎన్నటికీ తనది కాదని తేలిపోయింది. "రాజు ఎన్నటికీ తనవాడు కాజాలడు. జీవితమంతా ఒంటరిగా ఇలా చాకిరీ చేసుకుంటూ బ్రతకాలని" అనుకోగానే పరీక్షల హడావుడిలో కొట్టుకూంటూన్న రాజుకో ఉత్తరం వ్రాసింది. వెళ్ళిపోయేలోపున ఒక్కసారి చూచిపొమ్మని...

ఎలా మాట్లాడాలో, ఎలా ప్రవర్తించాలో చాలాసార్లు "రిహార్సల్" చేసుకుంది. అఖరుసారి వచ్చాడు. కాని తీరా ఎదురు పడ్డాక అంతా వెనకపడింది. పరీక్షలు, హడావుడి, ముందు, ముందుండే నిరుద్యోగంబాధ, ప్రస్తుతపు ఖర్చులు, పాశ్చాత్యవిద్యావ్యామోహం ఎన్నో మాట్లాడారు. ఆశవదులుకుంది. ఇంతలో అకస్మాత్తుగా అడిగాడు, "మిమ్మల్నో విషయం అడుగుతాను కోపగించుకోరుగద" అని. సరి, ప్రపోజ్ చేస్తాడు. ఇన్నాళ్ళబట్టీ మనస్సులో కోరినకోరికలు ఓరూపానికి వస్తున్నాయని వికశించిన ముఖంతో "అడగండి" అంది. రాజు కూడా సామాన్యుడే! అందరిలాగే, తల్లి-ధర్మయ్యతతంగం గురించే అడిగాడు; ఏవేవో పాతవిషయాలు తరచి ప్రశ్నించి మనస్సుని పొడిచాడు. ఆఖరు ఆశ నశించింది... ఏవేవో సమాధానాలు చెప్పింది..."ఇహ పోయేదేం లేదన్నట్లు" అడి

గింది. "మిమ్మల్నో విషయం అడుగుతాను, ఏమనుకోరుకద!" అని. "ఊఁ" అన్నాడాయన. సరి, తన ప్రేమని వెల్లడిచేసి, "రెండుసంవత్సరాల పట్టీ ఈ నా కోరికని మనస్సులోనే అణచుకొన్నా, మీ ప్రేమకర్హురాల్ని కాకపోయినా, సేవకన్నా అర్హురాల్నౌతానని తలుస్తా" అనిచెప్పి, చచ్చిపోయినా బావుణ్ణన్నంత అభిమానపడింది.

నిశ్శబ్దంగా కూర్చున్నాడు రాజు. యుగాలు గడిచినట్లైంది మీనకి. సరి మెల్లగా చెప్పాడు. "నేనింతవరకూ ఆ దృష్టిలో చూట్టంలేదు. నన్ను ప్రేమించి పెండ్లి చేసుకుంటాననేవాళ్లు కూడా ఉంటారనుకోలేదు. సాంఘికంగా 'పిల్ల పెళ్లి చెయ్యక తప్పదు' అని వెతకడంలో, చదువు సంధ్య సంప్రదాయాల, వెలకట్టడంలో, పాస్ మార్కు తెచ్చుకునే అల్లుళ్ల జాబితాలో వాణ్ణని అనుకుంటూన్నా...ఇంటికి వెళ్ళగానే వ్రాస్తా మళ్ళా" అని, మర్యాదగా శలవు పుచ్చుకున్నాడు. జాబు వ్రాశాడు. "పరశాఖ అనిగాని, డబ్బులేదు అనిగాని పట్టించుకోకపోయినా,...ఆ వొక్కటీ మాత్రం తల్లిదండ్రులు ఒప్పుకోవటం లేదు..." అని ముభావంగా వ్రాశాడు...

ఏడాది తరువాత ఈ శుభలేఖ..."పంపించకుండా ఉన్నా ఇంత బాధ ఉండేదికాదేమో!" అనుకుంది. 'ఎకడెమిక్'గా 'కథ' ఎలా ఉంటే బాగుండేదో ఆలోచించింది. ఎన్ని విధాల ఆలోచించినా ఆమె 'శవపరీక్ష'లో రాజుని దోషిగా ఆలోచించలేకపోయింది...తీరా పెండ్లిచేసుకున్నా ఏదో వంకొస్తే, "నీ తల్లిమాత్రం ఇంతకంటే చేసిందా?" అంటే ఏమైంది?...ఇంతకీ తల్లి,... సాధించలేని ప్రతీకారం గాండ్రించింది. పన్నెండు గంటలు దూరాన్న వినపడ్డాయి ఎన్నాళ్ళనుంచో దాచిన సీసాని బయటికి తీసింది. 'నాలుగు చుక్కలు...మళ్ళా ఈ బాధంతా ఉండదు' అని నిశ్చయానికి వచ్చింది గాజు గ్లాసులో పోసి, కొంచం నీళ్లుకూడా పోసి త్రాగడానికి ఎత్తింది.

ధైర్యం చాలలేదు. "ఇంతకీ తల్లి ఏంచేస్తుంది? చెల్లెలు మణి స్కూల్లో చదువుకుంటూంది. 'తల్లి పారిపోయింది. అక్క ఆత్మహత్య చేసుకుంది' అంటే జీవితం ఎల్లా భరిస్తుంది? అకాలంగా ముసలితనం గుండెనొప్పితో బాధపడుతూన్న తల్లి తనని నమ్ముకుని హాస్పిటల్లో చేరింది." అని పాశముపట్టి లాగినట్లు లాగేయి ఆలోచనలు. "రేపు ఇంకా ఇలాగేఉంటే, త్రాగేస్తానని" గ్లాసు పక్కనే పెట్టి, కళ్ళనీళ్ళ చారికలతోకూడా పడుకుంది. ఉదయంనుంచీ అలిసిపోవడాన్న కడుపులో ఏమీ లేకపోయినా గాఢంగా నిద్రపట్టింది.

ఉదయం లేచేసరికి చాలా తెల్లిగ్గా ఉంది. పారపోద్దామని గ్లాసుకోసం చూస్తే కనబడలే! రమణి ఆలస్యంగా వస్తాననడం, తలుపేసుకోకుండా పడుకోడం, మరో పెద్ద అపోహ కల్గించింది. ఒక్కగంతులో పక్కగదిలో పడింది. నీళ్ళనుకుని త్రాగిఉంటుందని ఊహ...మంచం మీద నోరుతెరుచుకుని, పాలిపోయిన ముఖంతో రమణి కనబడింది. ఈ హత్యకి నేనే కారణం అని అరచి క్రిందపడింది మీన...మంచి నిద్దరలోంచి ఉలిక్కిపడి లేచి, క్రిందపడిఉన్న మీన ముఖంమీద నీళ్లుజల్లి తొడమీద తలపెట్టుకు నాడి చూచింది. మీనకి తెలివొచ్చింది. తను కూడా హాయిగా చచ్చిపోయాననుకుంది, రమణితో పాటు—కాని తణివిచూస్తే తన పొరపాటు గ్రహించింది..."అంటే ఇద్దరం బతికేఉన్నాం అన్నమాట" అంటూ రమణి కౌగలించుకుంది వెర్రిగా.

